www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

బుధవారం ఏప్రిల్ 22 2026

ninadam.in



తెలంగాణలో పింఛన్ల పంపిణీలో కీలక మార్పు..

## నగరాలు, పట్టణాల్లో కొత్త రూల్

- గ్రామాల తర్వాత పట్టణ, నగర ప్రాంతాల్లోనూ ఫేస్ రికగ్నిషన్ విధానం
- అక్రమాలకు అడ్డుకట్ట వేసి, పారదర్శకత పెంచడమే లక్ష్యం
- వేలిముద్రల సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం నిర్ణయం
- అనర్హులను గుర్తించి, అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరేలా చర్యలు

2లో

## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు



**వాషింగ్టన్, ఏప్రిల్ 22 (నినాదం):** ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ 2లో

## సీఎం మమతపై ఈడీ వేసిన పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

సోదాల సమయంలో మమత జోక్యం చేసుకుని ఆధారాలు తీసుకెళ్లారని ఈడీ ఆరోపణ

ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరిన ఈడీ

పిటిషన్‌కు విచారణ అర్హత లేదని, ఇవి రాజకీయ దాడులని బెంగాల్ ప్రభుత్వం వాదన

ఇదే కేసులో ఐ-ప్యాక్ సహ వ్యవస్థాపకుడు వినేశ్ కుమార్ చందేల్ ఇప్పటికే అరెస్ట్

**కోల్‌కత్తా, ఏప్రిల్ 22 (నినాదం):** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి మధ్య నడుస్తున్న వివాదంలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐ-ప్యాక్) కార్యాలయంలో సోదాల 2లో



ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో సమ్మె నిర్ణయం

ఎన్నికల హామీలు అమలు చేయాలని కార్మికుల డిమాండ్

ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె..



డిపోలకే పరిమితమైన బస్సులు, ప్రయాణికులకు తిప్పలు



*తెలంగాణ వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు అర్ధరాత్రి నుంచి నిలిచిపోయాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వంతో మంగళవారం జరిపిన చర్చలు విఫలం కావడంతో ముందుగా ప్రకటించినట్లుగానే కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో బస్సులు బయటకు రాకుండా నిలిచిపోయాయి.*



## తెలంగాణ మహిళలకు 'ఫ్రీ' షాక్!

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అద్దె బస్సులు.. ప్రైవేట్ డ్రైవర్లు, కండక్టర్లతో పోలీసు ఎస్కార్ట్ వాహనాల నడుమ రోడ్డెక్కాయి. అయితే.. ఆ బస్సులు ఎక్కిన మహిళలకు పెద్ద షాకే తగులుతోంది. సమ్మె నేపథ్యంలో ఈ బస్సులలో ఉచిత ప్రయాణం కుదరదని.. టికెట్ తీసుకోవాల్సిందేనని కండక్టర్లు పట్టుబడుతున్నారు. దీంతో ఆధార్ కార్డు చేతబట్టిన మహిళలకు నోట మాట రావడం లేదు. కొన్ని రూట్లలో జరుగుతున్న ఈ పరిణామాలపై ఆర్టీసీ స్పందించాల్సి ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరినప్పటి నుంచి మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఆర్టీసీపై భారం పడకుండా ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తూ వస్తోంది.

## సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

- ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడి
- నాలుగు వారాల్లో కమిటీ నివేదిక సమర్పిస్తుందని మంత్రి పొన్నం హామీ

*తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.*



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** ఇవాళ ఉదయం నుంచే కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన 32 హామీలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. హామీలు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని డిపోల వద్ద కార్మికులు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కూడా బలంగా వినిపిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్ సహా అన్ని జిల్లాల్లోనూ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్ రీజియన్‌లో 641 బస్సులు ఆగిపోగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పది డిపోలకు చెందిన 850 బస్సులు నిలిచిపోయాయి. వేలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు. బస్టాండ్‌ల వద్ద ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. పరిస్థితిని 2లో



## పహల్గామ్ నెత్తుటి జ్ఞాపకం..

ఏడాది తర్వాత కూడా వీడని విషాదం..

ప్రధాని మోదీ భావోద్వేగ ట్వీట్

- 'ఎక్స్' వేదికగా అమరులను స్మరించుకున్న ప్రధాని మోదీ
- ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలొగ్గదని స్పష్టీకరణ

2లో




## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావులకు భారీ ఊరట

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం

కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నా, నివేదిక ఆధారంగా చర్యలు చెల్లవని వ్యాఖ్య

2లో

## హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణాలకు ఇబ్బంది

హైదరాబాద్‌లో మెట్రో సర్వీసులు పెంచుతున్నట్లు వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** నేటి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణాలు పెట్టుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాలకు, పనులకు వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. దీనితో హైదరాబాద్ మెట్రో సర్వీసులను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ మార్గాల్లో సర్వీసులను పెంచుతున్నామని మెట్రో రైలు వెల్లడించింది. మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్, 2లో



జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను

## హైకోర్టు తప్పు పట్టలేదు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందనేది వాస్తవమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను గానీ, సంబంధిత నివేదికను గానీ, దర్యాప్తు తీరునుగానీ హైకోర్టు తప్పుపట్టలేదని, కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికను 2లో

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

- హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 2లో



## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..

- హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత
- రేపు సాయంత్రం 4 గంటలకు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు
- 1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల
- నాదెండ్ల వయసు 90 సంవత్సరాలు

మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల చంద్రబాబు సంతాపం

- నాదెండ్ల మనోహర్‌ను ఫోన్‌లో పరామర్శించిన ముఖ్యమంత్రి
- కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసిన చంద్రబాబు





**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన 2లో

బెంగాల్‌లో

## బాబ్రీ మసీదు కట్టనీయం

బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఘాటు విమర్శలు



**కోల్‌కత్తా, ఏప్రిల్ 22 (నినాదం):** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మరోసారి ఘాటు విమర్శలు చేశారు. మమతా దీదీ ఎంత బలంగా కోరుకున్నా, ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా బెంగాల్‌లో బాబ్రీ మసీదును బీజేపీ కట్టనీయదని స్పష్టం చేశారు. టీఎంసీ సిండికేట్ ముఠాలను బెంగాల్ నుంచి పారిపోయేలా చేస్తామన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగనుండగా, రెండో విడత ప్రచారంలో భాగంగా నార్త్ 24 పరగణాల జిల్లాలోని డుమ్ డుమ్ ఉత్తర్ ఏరియాలో బుధవారంనాడు జరిగిన ర్యాలీలో అమిత్‌షా పాల్గొన్నారు. 'ఇవాళ బెంగాల్ మొత్తం సిండికేట్లమయంగా మారింది. సిమెంట్, ఇసుక, ఇటుకలు ఏమి కావాలన్నా మీరు సిండికేట్లకు డబ్బులు చెల్లించాలి. డుమ్ డుమ్ ప్రజలకు నేను ఒకటే చెప్పదలచుకున్నాను. ఈనెల 5వ తేదీ తర్వాత ఈ సిండికేట్ సభ్యులు తట్టాబుట్టా సద్దుకుని బెంగాల్ నుంచి 2లో

## లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్న ప్రభుత్వం

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల ఆరోపణలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును హైకోర్టు నిలిపివేయడంతో తదుపరి ఎలా ముందుకు వెళ్లాలన్న అంశంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. హైకోర్టు తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం లీగల్ ఒపీనియన్ తీసుకుంటోంది. ప్రభుత్వం ముందు రెండు ఆప్షన్స్ ఉన్నాయని లీగల్ టీమ్ చెబుతోంది. మొదటిది 2లో

## ఆ విద్యార్థినులపై లైంగిక వేధింపులు నిజమే

- డా.రాయపాటి శైలజ

**విజయవాడ ఏప్రిల్ 22 (నినాదం):** ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల విద్యార్థినులపై లెక్చరర్ లైంగిక వేధింపులంటూ మహిళా కమిషన్‌కు ఓ మెయిల్ వచ్చింది. దీంతో ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టేందుకు ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా.రాయపాటి శైలజ కళాశాలకు వెళ్లారు. విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు చెప్పారు. కళాశాలలోని అంతర్గత కమిటీ ఇప్పటికే విచారణ జరిపిందని, ఆ నివేదికలో అంతా బాగున్నట్లు చూపించిందని తెలిపారు. అయితే, విద్యార్థినులతో మాట్లాడితే లైంగిక వేధింపులు నిజమేనని నిర్ధరణ అయ్యిందన్నారు.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM 02 డిజిటల్ ఎడిషన్

బుధవారం ఏప్రిల్ 22 2026

ninadam.in


## లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్న ప్రభుత్వం

సుప్రీంకోర్టుకు వెళ్లడం లేదా రెండోది కొత్త కమిషన్‌ను నియమించడం. ఈ విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చించారు. కోర్టు తీర్పుపై రేపు కేబినెట్‌లో చర్చించనుంది రాష్ట్ర ప్రభుత్వం. కేబినెట్‌కు అడ్వకేట్ జనరల్‌ను పిలవాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది. రేపటి సమావేశానికి అడ్వకేట్ జనరల్ హాజరుకానున్నారు. కేబినెట్ సమావేశం తర్వాత నిర్ణయం తీసుకుని ఆ మేరకు ప్రభుత్వం ముందుకు వెళ్లనుంది. కాగా, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును హైకోర్టు నిలిపివేసింది. రిపోర్టు ఆధారంగా చర్చలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. కమిషన్ నిబంధనలు పాటించలేదని పేర్కొంది.

## సీఎం మమతపై ఈడీ వేసిన పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

సమయంలో మమత జోక్యం చేసుకున్నారని ఆరోపిస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. బొగ్గు స్మగ్లింగ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ ఏడాది జనవరి 8న ఈడీ అధికారులు ఐ-ప్యాక్ కార్యాలయం, దాని వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో సీఎం మమత 100 మందికి పైగా పోలీసులతో అక్కడికి చేరుకుని, దర్యాప్తునకు అడ్డుతగలడమే కాకుండా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, కీలక డాక్యుమెంట్లు వంటి ఆధారాలను బలవంతంగా తీసుకెళ్లారని ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ తరఫున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. మమత జోక్యంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. కేంద్ర దర్యాప్తు సంస్థల విధులకు రాష్ట్ర ముఖ్యమంత్రే అడ్డంకులు సృష్టిస్తే చూస్తూ ఊరుకోలేమని వాదించారు. గతంలో ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు, ఈ ఘర్షణను 'చాలా అసాధారణం', 'విచారకరమైన పరిస్థితి' అని వ్యాఖ్యానించింది. మరోవైపు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. ఒక ప్రభుత్వ శాఖ అయిన ఈడీ నేరుగా ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తృణమూల్ కాంగ్రెస్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇదే కేసుకు సంబంధించి ఐ-ప్యాక్ సహ వ్యవస్థాపకుడు వినేశ్ కుమార్ చందేల్‌ను ఏప్రిల్ 13న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు అతడికి ఏప్రిల్ 23 వరకు 10 రోజుల ఈడీ కస్టడీ విధించడం గమనార్హం.

## హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం

నాగోల్-రాయదుర్గం కారిడార్‌లలో మెట్రో సేవలను పెంచింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులను పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. మియాపూర్-ఎల్బీనగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్‌లో ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్ పీక్ అవర్లలో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు ఉంటుంది. ఇప్పుడు ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలును నడుపుతున్నట్లు తెలిపింది. నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో నాన్ పీక్ అవర్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు ఉంటుంది. కానీ ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు నడుపుతున్నట్లు వెల్లడించింది.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను హైకోర్టు తప్పు పట్టలేదు

కూడా తప్పుపట్టలేదని అన్నారు. విధానపరమైన నిర్ణయాన్ని మాత్రమే తప్పుపట్టిందన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కుంగిందనేది వాస్తవని చెప్పారు. "కాళేశ్వరం దోషులు ఎప్పటికైనా జైలుకు వెళ్లటం ఖాయం. హైకోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తదుపరి చర్యలకు వెళ్తుంది. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని భాజపా నేతలు అనలేదా? బీఆర్ఎస్ నేతలకు కాళేశ్వరం ఏటీఎంగా మారిందని మోదీ, అమిత్ షా గతంలో ఆరోపించారు. సీబీఐకి అప్పగిస్తే రెండ్రోజుల్లోనే దోషులను జైల్లో పెడతామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. సీబీఐ దర్యాప్తు కోరితే కేంద్రం చర్యలు తీసుకోలేదు. మరి సీబీఐ దర్యాప్తు ఎందుకు ప్రారంభం కాలేదో కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి" అని మహేశ్ గౌడ్ డిమాండ్ చేశారు.

# తెలంగాణలో ఆర్టీసీ సమ్మె..

గమనించిన అధికారులు, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్నిచోట్ల అద్దె బస్సులను నడిపేందుకు కసరత్తు చేస్తున్నారు. అయితే, అవి ప్రయాణికుల రద్దీకి సరిపోకపోవడంతో చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

### సమ్మె పరిష్కారం కాదు.. విధుల్లో చేరండి- పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. మిగిలిన ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు. రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్ ÷ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్‌÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

## హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావులకు భారీ ఊరట

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహ అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరఫున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### ఇరాన్‌తో యుద్ధం ఎఫెక్ట్..

## సగానికి తగ్గిపోయిన అమెరికా కీలక క్షిపణి నిల్వలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 22 (నినాదం):**

పేట్రియాట్, థాడ్ ఇంటర్‌సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. అయతుల్లా ఖమేనీని అంతమొందిస్తే ఇరాన్‌లో పాలన కూలిపోతుందని అమెరికా వేసిన అంచనాలు తారుమారయ్యాయి. ఇరాన్‌తో సుమారు రెండు నెలలుగా యుద్ధం సాగుతోంది. సుదీర్ఘకాలం యుద్ధం సాగుతుండటంతో అమెరికాలో క్షిపణి నిల్వలు క్షీణిస్తున్నాయి. ఇది అమెరికాను ఆందోళనకు గురి చేస్తోంది. పేట్రియాడ్, థాడ్ ఇంటర్‌సెప్టర్‌తో పాటు తోమహాక్ క్షిపణి నిల్వలు కూడా 35 శాతం మేర క్షీణించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి.



ప్రిసిషన్ స్ట్రైక్ మిసైళ్ల నిల్వలో 45 శాతం కంటే ఎక్కువగా ఇరాన్ యుద్ధంలో అమెరికా వినియోగించింది. స్వల్ప వ్యవధిలో సైనిక కార్యకలాపాలకు ఈ నిల్వలతో ఇబ్బంది లేనప్పటికీ, మరే ప్రాంతంలో భారీ ఘర్షణలో పాల్గొనాల్సి వస్తే ఈ ఆయుధ నిల్వలపై ఆధారపడే పరిస్థితి లేదని చెబుతున్నాయి. మరోవైపు, ఇరాన్ కీలక సైనిక సామర్థ్యాలను కలిగి ఉన్నట్లు పెంటగాన్ నిఘా విభాగం అంచనా వేసింది. ఇరాన్ సైనిక సామర్థ్యాలను భారీగా దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్నారు. కానీ ఇరాన్ ఆయుధ బలం అందుకు భిన్నంగా ఉందని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ కంటే అమెరికాకే కాల్పుల విరమణ ఒప్పందం అవసరం ఎక్కువగా ఉందని అంటున్నారు.

# బెంగాల్‌లో బాబ్రీ మసీదు కట్టనీయం

పారిపోవడమో, వసలపోవడమో జరుగుతుంది' అని అమిత్‌షా అన్నారు. హుమయూన్ కబీర్ పేరుతో బాబ్రీ మసీదు నిర్మించాలని మమతాబెనర్జీ కోరుకుంటున్నారని అమిత్‌షా విమర్శించారు. 'ఎవరూ ఆందోళన చెందవద్దు. మమతా దీదీ ఎంత గట్టిగా కోరుకున్నప్పటికీ బెంగాల్‌లో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని బీజేపీ అనుమతించే ప్రసక్తే లేదు' అని అన్నారు. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ, దుర్గాపూర్ మెడికల్ కాలేజీ, సౌత్ కోల్‌కతా లా కాలేజీలో ఘటనలు చూస్తే రాష్ట్రంలో శంతిభద్రతలు ఎంత దయనీయంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. రాత్రివేళల్లో మహిళల సంచారంపై మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. మే 5 తర్వాత ఆ పరిస్థితి ఉండదని, చిన్నారి ఆడపిల్లలు కూడా ధైర్యంగా స్కూటరుపై బయటకు వస్తే ఏ దుండగుడు అడ్డుకునే పరిస్థితి ఉండదని చెప్పారు. 'బంగారు బంగ్లా' కలను బీజేపీ సాకారం చేస్తుందని, బెంగాల్ సంస్కృతి, వారసత్వాన్ని తిరిగి సుసంపన్న చేస్తుందని అన్నారు.

### కాంగ్రెస్ ఖాతా కూడా తెరవదు..

కాంగ్రెస్ పార్టీ తమిళనాడు, పుదుచ్చేరిలో రెండంకెల స్థాయిలో కూడా సీట్లు తెచ్చుకోలేదని, బెంగాల్‌లో ఆ పార్టీ ఖాతా తెరిచే పరిస్థితి కూడా లేదని అమిత్‌షా అన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పించే వారికే ప్రజలు ఓటు వేయాలని, ఈ ఎన్నికలు ఒక ఎమ్మెల్యేనో, ప్రభుత్వాన్నో ఎన్నుకోవడానికే సంబంధించి ఎన్నికలు కావని, రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నికలని చెప్పారు. 294 అసెంబ్లీ స్థానాలున్న బెంగాల్‌లో తొలివిడత 152 నియోజకవర్గాల్లో ఈనెల 23న పోలింగ్ జరుగునుండగా, తక్కిన స్థానాల్లో ఈనెల 29న పోలింగ్ జరుగుతుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

### తెలంగాణలో పింఛన్ల పంపిణీలో కీలక మార్పు..

# నగరాలు, పట్టణాల్లో కొత్త రూల్

తెలంగాణలో ఆసరా పింఛన్ల పంపిణీలో పారదర్శకత పెంచేందుకు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా అమలవుతున్న 'ముఖ గుర్తింపు' (ఫేషియల్ రికగ్నిషన్) విధానాన్ని ఇకపై రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లోనూ అమలు చేయనుంది. ఈ విధానం ద్వారా పింఛన్ల పంపిణీలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త విధానం అమలుపై ప్రజాభవన్‌లో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సమన్వయకర్తలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రాజెక్టు మేనేజర్లు, వార్డు అధికారులకు ఈ విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఇక్కడ శిక్షణ పొందిన అధికారులు తమ జిల్లాల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చి, క్షేత్రస్థాయిలో ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తారని పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సీఈవో దివ్యాదేవరాజన్ తెలిపారు. గతంలో పింఛన్ల పంపిణీ సమయంలో వృద్ధుల వేలిముద్రలు ఫింగర్‌ప్రింట్ స్కానర్లలో సరిగా నమోదు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. దీనికితోడు, చనిపోయిన లబ్ధిదారుల పేర్లతో కొందరు అక్రమంగా డబ్బులు స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని తీసుకొచ్చారు. దీనివల్ల లబ్ధిదారులు వేలిముద్రలతో పనిలేకుండా, యాప్ ద్వారా సులభంగా తమ గుర్తింపును నమోదు చేసి పింఛన్ తీసుకోవచ్చు. ఈ కొత్త టెక్నాలజీతో లబ్ధిదారుడు జీవించి ఉన్నాడా లేదా, వలస వెళ్లాడా అనే విషయాలు సులభంగా తెలిసిపోతాయి. వరుసగా మూడు నెలలు పింఛన్ తీసుకోని వారిని గుర్తించడం, చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం వంటివి వేగంగా జరుగుతాయి. తద్వారా అనర్హులను ఏరివేసి, కేవలం అర్హులకే ప్రభుత్వ లబ్ధి అందేలా చూడటమే ఈ మార్పు ప్రధాన ఉద్దేశం. జిల్లాల్లో సిబ్బంది శిక్షణ పూర్తయిన వెంటనే నగర, పట్టణ ప్రాంతాల్లో ఈ విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది.

## పహల్గామ్ నెత్తుటి జ్ఞాపకం..

ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన అత్యంత హేయమైన ఉగ్రదాడికి నేటితో సరిగ్గా ఏడాది పూర్తయ్యింది. 2025 ఏప్రిల్ 22న జరిగిన ఈ దుర్ఘటనలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకరమైన రోజుపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా భావోద్వేగంగా స్పందించారు. దాడిలో మరణించిన వారిని స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు దేశం మొత్తం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉగ్రవాదంపై భారత్ తన పోరాటంలో ఎప్పటికీ వెనకడుగు వేయదన్నారు.

"గతేడాది ఇదే రోజున జరిగిన దారుణమైన పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులను స్మరించుకుంటున్నా. వారిని ఎన్నటికీ మరచిపోలేము. ఈ నష్టం నుంచి కోలుకుంటున్న మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఒక దేశంగా మనం దుఃఖంలోనూ, సంకల్పంలోనూ ఐక్యంగా నిలబడ్డాం. భారతదేశం ఏ రూపంలోనూ ఉగ్రవాదానికి తలొగ్గదు. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎన్నటికీ సఫలం కావు" అంటూ ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

ఏడాది క్రితం ఏం జరిగింది?

గతేడాది ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన పహల్గామ్‌లోని బైసన్ పచ్చిక బయళ్లలో ఈ దారుణం చోటుచేసుకుంది. పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒక స్థానికుడితో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడి దేశవ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ దాడికి ప్రతీకారంగా భారత సైన్యం కఠిన చర్యలు చేపట్టింది. దాడి జరిగిన కొన్ని రోజులకే, మే 7న 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్ భూభాగంలో సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టి పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక పంపింది. అంతేకాగాక పహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు పారిపోకముందే వారిని మట్టుబెట్టేందుకు 'ఆపరేషన్ మహదేవ్' చేపట్టింది. ఈ రెండు ఆపరేషన్ల ద్వారా ఉగ్రవాద చర్యలను సహించేది లేదని భారత్ ప్రపంచానికి స్పష్టమైన సంకేతం ఇచ్చింది.

# ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళిశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూత..

సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

### మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల చంద్రబాబు సంతాపం

మాజీ సీఎం నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతాపం తెలియజేశారు.

నాదెండ్ల భాస్కరరావు తనయుడు, కేబినెట్ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ముఖ్యమంత్రి ఫోన్ చేసి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి భాస్కరరావు 90 ఏళ్ల వయస్సులో మృతి చెందిన విషయం తెలిసిందే. నెల రోజులుగా హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈరోజు తుదిశ్వాస విడిచారు. గురువారం పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్న ట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, 1984లో నెల రోజుల పాటు ఏపీ సీఎంగా పని చేశారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. స్కూళ్లలో 'వాటర్ బెల్'తో ఢిల్లీ ప్రభుత్వం వినూత్న ఆలోచన

- వేసవి నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం మార్గదర్శకాలు
- విద్యార్థులు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి గంటకు ఒకసారి బెల్ మోగించాలని సూచన
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు

**ఢిల్లీ, ఏప్రిల్ 22 (నినాదం):**


దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థుల భద్రత అధికారులకు ప్రధాన ఆందోళనగా మారింది. ఎండ వేడి సంబంధిత ప్రమాదాలను తగ్గించడానికి, వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే రోజులలో పిల్లల భద్రత కోసం ఢిల్లీ పాఠశాలలు ఇప్పుడు తక్షణ చర్యలు చేపడుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది. పిల్లల్లో డీహైడ్రేషన్, వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను అమలు చేయాలని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం, ఈ వేసవి కాలంలో విద్యార్థులకు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి 45 నిమిషాల నుంచి 60 నిమిషాలకు గంట మోగించాలి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న క్రమంలో, విద్యార్థులు క్రమం తప్పకుండా నీటిని తీసుకునేలా ఢిల్లీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. అలాగే, విద్యార్థులను గ్రూపులుగా చేసి, ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకునేలా బడ్డీ సిస్టంను ప్రవేశపెట్టింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున, మార్నింగ్ అసెంబ్లీని రద్దు చేసింది లేదా వాటిని తక్కువ సమయంలో పాఠశాల లోపల నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ తరగతులను నిషేధించింది. పాఠశాలల్లో వెలుపల నిర్వహించే ఫిజికల్ యాక్టివిటీస్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశించింది. పాఠశాలల్లో నిత్యం చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం తల్లిదండ్రులు, విద్యార్థులకు కూడా సూచనలు చేసింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించింది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ విషయాన్ని పంచుకోవాలని తెలిపింది. వడగాల్పు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించింది. తమ పిల్లలను తేలికైన గాలి సులభంగా ఆడే కాటన్ దుస్తుల్లో పాఠశాలకు పంపించాలని ప్రభుత్వం తల్లిదండ్రులకు సూచించింది.



## పీసీ ఘోష్ కమిషన్ ను హైకోర్టు తప్పుబట్టలేదన్న హైకోర్టు

- మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని వ్యాఖ్య
- కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించిందన్న మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):**



కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న కేసీఆర్, హరీశ్ రావు, కొందరు అధికారులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ నేతలు క్లీన్ చిట్‌గా భావించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు ఎక్కడా పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును తప్పుబట్టలేదని, దాని నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని మంత్రి గుర్తు చేశారు. మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని, ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న వాస్తవంలో మార్పు లేదని తెలిపారు. హైకోర్టు తీర్పుపై రేపు జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రభుత్వం తన తదుపరి అడుగులను ప్రకటిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
బుధవారం ఏప్రిల్ 22 2026
ninadam.in
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్



# ఏపీ లిక్కర్ స్కాం...
## విచారణకు హాజరు కావాలని రాజ్ కెసిరెడ్డికి హైకోర్టు ఆదేశం

- ఈ నెల 24న సిట్ దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని ఉత్తర్వు
- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం
- పిటిషన్‌పై తదుపరి విచారణను కూడా ఏప్రిల్ 24వ తేదీకి వాయిదా



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, ఈ నెల 24న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారి ఎదుట విచారణకు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం స్కాం కేసులో విచారణకు రావాలంటూ సిట్ అధికారులు ఇటీవల రాజ్ కెసిరెడ్డికి నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అరెస్టు నుంచి రక్షణ కోరుతూ ఆయన హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం విచారణ చేపట్టింది. సిట్ జారీ చేసిన నోటీసులను అనుసరించి దర్యాప్తునకు హాజరుకావాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఏప్రిల్ 24న విచారణ అధికారి ముందు హాజరు కావాలని రాజ్ కెసిరెడ్డిని ఆదేశించింది. ఇదే సమయంలో, ఆయన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను కూడా ఏప్రిల్ 24వ తేదీకి వాయిదా వేసింది. దీంతో దర్యాప్తు సంస్థ ముందు హాజరయ్యే రోజే ఆయన బెయిల్ భవితవ్యంపై కూడా స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# పిఠాపురంలో మళ్లీ ఫ్లెక్సీ చిచ్చు..
## పవన్‌ను టార్గెట్ చేస్తున్నారంటూ వర్మపై ముద్రగడ క్రాంతి ఫైర్

- సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం
- వర్మ తీరుపై జనసేన నేత ముద్రగడ క్రాంతి తీవ్రస్థాయిలో విమర్శలు



**కాకినాడ, ఏప్రిల్ 22 (నినాదం):** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో అధికార కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఓ ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు నాయుడు ఫొటో లేకపోవడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ ఘటన ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాటకు, ఉద్రిక్తతకు కారణమైంది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) కార్యాలయంలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఈ వివాదం చోటుచేసుకుంది. ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడాన్ని గమనించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ.. అక్కడి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న జనసేన నేతలు తుమ్మలబాబు, పెండెం దొరబాబులు వర్మతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పెండెం దొరబాబు, వర్మపైకి దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈ ఘటనపై జనసేన పార్టీ నేత, ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ తీరుపై ఆమె తీవ్ర విమర్శలు చేశారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ పోటీ చేసినప్పటి నుంచి వర్మ వైఖరి వింతగా ఉందని, ఉద్దేశపూర్వకంగానే ఆయన రచ్చ చేస్తున్నారని ఆరోపించారు. "ఫ్లెక్సీలో ఫొటోల గురించి రగడ సృష్టించడం ఏమిటండి? ఈ రెండేళ్లలోనే ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ రూ.600 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గానికి తీసుకొచ్చారు. ఇంకా అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నారు. అయినా చీటికీ మాటికీ పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం సరికాదు" అని క్రాంతి అన్నారు. పవన్ కల్యాణ్ కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాదని, జనసేన అధినేతగా ఎన్డీయేలో భాగస్వామి అనే విషయాన్ని వర్మ గుర్తుంచుకోవాలని ఆమె హితవు పలికారు. వర్మ తీరు కూటమిలో చిచ్చు పెట్టేలా ఉందని, ప్రజల్లో కూడా దీనిపై గుసగుసలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవాలి కానీ, ఇలా బహిరంగంగా వ్యవహరించి వార్తల్లోకి ఎక్కడం సబబు కాదని సూచించారు. ఇప్పటికైనా వర్మ తన తీరు మార్చుకోవాలని క్రాంతి సలహా ఇచ్చారు.

# పోలవరంపై సందేహాలకు తెర..
## పూర్తి ఎత్తుతోనే నిర్మాణం

గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లుగా పీపీఏ అధికారిక ప్రకటన



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** బహుళార్ధ సాధక పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న సందేహాలకు తెరపడింది. ప్రాజెక్టును దాని పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పీపీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పీపీఏ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ.28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా.

# నల్లజర్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురి దుర్మరణం

- టోల్‌గేట్ సూచిక బోర్డును ఢీకొట్టిన కారు
- ఏలూరు నుంచి రాజమండ్రి వెళ్తుండగా ఘటన



**తూర్పుగోదావరి ఏప్రిల్ 22 (నినాదం):** తూర్పుగోదావరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నల్లజర్ల మండలం వీరవల్లి టోల్‌గేట్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు, టోల్‌గేట్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్న సూచిక బోర్డును వేగంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన తీరును గమనిస్తే కారు వేగం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్లే ప్రమాదం జరిగిందా? లేక మరేదైనా కారణమా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

# సింగపూర్ హోం మంత్రితో ఏపీ మంత్రుల భేటీ.. కీలక అంశాలపై చర్చ

- రెండో రోజు కొనసాగుతున్న ఏపీ మంత్రుల సింగపూర్ పర్యటన
- పోలీసు వ్యవస్థ పనితీరును అడిగి తెలుసుకున్న మంత్రులు



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందం సింగపూర్ పర్యటన రెండో రోజు అత్యంత కీలకమైన భేటీలతో కొనసాగుతోంది. రాష్ట్ర మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్‌లు, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్ సింగపూర్ హోం మంత్రి కె.షణ్ముగంతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. సింగపూర్‌లో నేరాల శాతం తక్కువగా ఉండటానికి కారణమైన కఠిన చట్టాలు, పోలీసు వ్యవస్థ పనితీరును మంత్రులు అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణ కోసం సింగపూర్ ఉపయోగిస్తున్న టెక్నాలజీ ఆధారిత నిఘా వ్యవస్థపై హోం మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక ఆసక్తిని కనపరిచారు. ఏపీలో కూడా ఇటువంటి అధునాతన వ్యవస్థలను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించారు. మరోవైపు, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ లో మంత్రులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పట్టణాల రూపకల్పన, భూమి వినియోగంలో పారదర్శకత, 'నేషన్ ఫస్ట్' సిద్ధాంతంతో పాలనలో బాధ్యతాయుతంగా ఎలా వ్యవహరించాలనే అంశాలపై నిపుణులు ప్రజెంటేషన్ ఇచ్చారు. నిన్న ప్రారంభమైన మంత్రుల సింగపూర్ పర్యటన... ఏడు రోజుల పాటు కొనసాగనుంది.

## 'పాడా' సమావేశంలో ప్రొటోకాల్ రగడ..
- సీఎం చంద్రబాబు ఆగ్రహం



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో కూటమి నేతల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అక్కడ నిర్వహించిన 'పాడా' సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంతో తెదేపా నేతలు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ప్రొటోకాల్ వివాదం సీఎం చంద్రబాబు దృష్టికి రావడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడారు. ఈ ఘటనలో పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ తీరును సీఎం తప్పు పట్టారు. ప్రొటోకాల్, ఫ్లెక్సీలపై ఫొటోల పేరుతో ఘర్షణపడటం సరికాదన్నారు. ఏదైనా పొరపాటు జరిగితే పార్టీ పెద్దలకు, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. బహిరంగంగా గొడవపడటం వల్ల లాభం ఉండదన్నారు. ఇలాంటి ఘటనలు క్యాడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పల్లా శ్రీనివాస్‌కు సూచించారు. మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు చేయాలని ఆదేశించారు.

# పల్నాడులో కలకలం..
## వైసీపీ నేత ఇంట్లో ఐదు నాటు బాంబులు

- వైసీపీ నేత ఇంటి నుంచి ఐదు నాటు బాంబుల స్వాధీనం
- టీడీపీ నేత హత్యకేసు నిందితుడి తండ్రి ఇల్లుగా గుర్తింపు
- పాత కక్షల నేపథ్యంలోనే బాంబులు దాచారని పోలీసుల అనుమానం
- గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు



**పల్నాడు ఏప్రిల్ 22 (నినాదం):** పల్నాడు జిల్లాలో నాటు బాంబులు తీవ్ర కలకలం రేపాయి. బెల్లంకొండ మండలం పాపాయపాలెం గ్రామంలోని ఓ వైసీపీ నేత ఇంట్లో ఐదు నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో జరిగిన టీడీపీ నేత హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తి తండ్రి ఇంట్లో ఈ బాంబులు లభ్యం కావడంతో పాత కక్షల కోణంపై పోలీసులు దృష్టి సారించారు. గ్రామస్థుల సమాచారం మేరకు నిన్న పోలీసులు తనిఖీలు చేపట్టారు. వైసీపీ నేతగా ఉన్న సంక్రాంతి కోటయ్యకు చెందిన ఇంటి టాయిలెట్‌లో ప్లాస్టిక్ బకెట్‌లో దాచిన ఐదు నాటు బాంబులను గుర్తించారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, క్రోసూరు సీఐ సురేశ్.. బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని వాటిని నిర్వీర్యం చేశారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన టీడీపీ నేత కృష్ణయ్య హత్య కేసులో కోటయ్య కుమారుడు గోపాలకృష్ణ అలియాస్ గోపి ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం అతడు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. ఈ నేపథ్యంలో పాత కక్షల కారణంగానే ప్రత్యర్థులపై దాడి చేసేందుకు ఈ బాంబులను నిల్వ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

# ఏపీ రాజ్యసభ రేసులో అనూహ్య పరిణామం..
## అన్నామలై పేరు పరిశీలన!

- రాష్ట్రంలో ఖాళీ అవుతున్న 4 స్థానాల్లో బీజేపీకి ఒకటి కేటాయించే అవకాశం, ● గతంలోనూ ప్రచారం జరిగినా.. ఈసారి అన్నామలైకి ఛాన్స్ ఖాయమంటున్న వర్గాలు, ● జనసేన నుంచి తొలిసారిగా పెద్దల సభకు సభ్యుడు.. రేసులో లింగమనేని రమేశ్, ● టీడీపీ నుంచి ఇద్దరికి అవకాశం.. రేసులో పలువురు సీనియర్లు, పారిశ్రామికవేత్తలు



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఏపీ రాజకీయాల్లో రాజ్యసభ ఎన్నికల వేడి మొదలైంది. కూటమిలో సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతుండగా, బీజేపీ కోటాలో తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. తమిళనాడు రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న అన్నామలైని ఏపీ నుంచి పెద్దల సభకు పంపేందుకు బీజేపీ అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీలో జూన్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమికి ఈ నాలుగు స్థానాలను దక్కించుకునే సంఖ్యాబలం ఉంది. పొత్తులో భాగంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం టీడీపీకి రెండు, జనసేన, బీజేపీలకు చెరొక స్థానం కేటాయించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు డి.మాధవ్ మధ్య ఈ విషయంపై చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీజేపీకి దక్కే ఒక్క స్థానాన్ని అన్నామలైకి కేటాయించాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్న ఆయనకు, ఈ రూపంలో జాతీయ స్థాయిలో కీలక పదవి ఇవ్వాలని బీజేపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి గతంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా చేసినప్పుడు కూడా ఏపీ కోటాలో అన్నామలై పేరు వినిపించింది. కానీ, అప్పుడు ఏపీకే చెందిన బీజేపీ నేత పాక వెంకట సత్యనారాయణకు అవకాశం దక్కింది. దీంతో ఈసారైనా ఆయనకు అవకాశం దక్కుతుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు జనసేన పార్టీ నుంచి కూడా తొలిసారిగా ఒకరు పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఆ పార్టీ తరఫున పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు బలంగా వినిపిస్తోంది. ఇక, టీడీపీకి కేటాయించే రెండు స్థానాల కోసం ఆశావహుల జాబితా పెద్దగానే ఉంది. ప్రస్తుత ఎంపీ సానా సతీశ్‌కు తిరిగి అవకాశం ఇస్తారా? లేక పార్టీలో ఆయనకు కీలక పదవిని ఇచ్చి ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తారా? అనే చర్చ జరుగుతోంది. ఆయనకు కాకపోతే మంత్రి లోకేశ్ సన్నిహితుడు కిలారు రాజేశ్ పేరు పరిశీలనలో ఉంది. వీరితో పాటు భారత్ బయోటెక్ ఛైర్మన్ కృష్ణ ఎల్లా, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా, సీనియర్ నేత వర్ల రామయ్య పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. మొత్తం మీద అన్నామలై పేరు తెరపైకి రావడంతో ఏపీ రాజ్యసభ ఎన్నికల రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది. కూటమిలోని పార్టీలు ఎవరిని ఎంపిక చేస్తాయోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# నాదెండ్ల భాస్కరరావు మరణం రాష్ట్రానికి తీరని లోటు - జగన్



**అమరావతి, ఏప్రిల్ 22 (నినాదం):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఈ రోజు కన్నుమూసిన సంగతి తెలిసిందే. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... నాదెండ్ల భాస్కరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఏపీ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కరరావు విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రజాసేవలో ఆయన నిబద్ధత, రాజకీయ అనుభవం తరతరాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.

# హామీలను నెరవేరుస్తూ..అభివృద్ధి

- ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఏప్రిల్ 22 (నినాదం):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ 22 నెలల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ రూ.1.30 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, పుల్లలరేవులో రూ.50 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలో చేపట్టిన అన్నిపనులను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తూ 22 నెలల్లోనే రాప్తాడు మండలంలో రూ.26 కోట్లతో రోడ్లు వేశామన్నారు. గొందిరెడ్డిపల్లి నుంచి పుల్లలరేవు వరకూ తారు రోడ్డు నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు.

# కులాల మధ్య చిచ్చుతో రాజకీయ పబ్బం

- వైసిపి తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమండ్రి, ఏప్రిల్ 22 (నినాదం):** రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి.. రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. 'కులాల మధ్య చిచ్చు పెడుతుంటే మేము చూస్తూ ఊరుకోం.. రాజకీయంగా పతనం కావడంతోనే జగన్ ఇలాంటి అరాచకాలకు తెరలేపారు' అని ఆయన విమర్శించారు. తనపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రంగా ఖండించారు. కాపు సామాజిక వర్గాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలను బ్లూ మీడియా ఉద్దేశపూర్వకంగా వక్రీకరించిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే సాక్షి పత్రికై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ.. 'రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేస్తున్నాం. అంబటి అయినా గింబటి అయినా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. నా వ్యాఖ్యలను సాక్షి పత్రిక వక్రీకరించింది. జగన్ ఒక 'సూసైడ్ స్క్వాడ్'ను తయారు చేశారు. విచ్ఛిన్న శక్తులకు తాడేపల్లి ప్యాలెస్ కేంద్రంగా మారింది. దేవాలయాలు, వ్యక్తుల పైనా దాడులు చేయిస్తున్నారు. జక్కంపూడి రాజా లాంటి వాళ్ళను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి. మాజీ ఎంపీ మార్గాని భరత్ రాజమండ్రి కంబాల చెరువు, దేవిచౌక్ ప్రాంతాలను అభివృద్ధి పేరుతో కంపుకొట్టించారు. కుర్రాళ్లు వాస్తవాలు తెలుసుకొని రాష్ట్ర భవిష్యత్తు గురించి మాట్లాడితే బాగుంటుంది. కూటమి ప్రభుత్వం సమన్వయంతో పని చేస్తోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నారు. సిగ్గులేకుండా ఇసుక గురించి మాట్లాడుతున్న వైసీపీ నేతలకు దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసురుతున్నా.' అని అన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు బిఆర్ఎస్ సంఘీభావం

- ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని ప్రభుత్వం

**హైదారబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంఘీభావం తెలిపుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వంలోనే కేబినెట్ ఆమోదం తెలిపి, జీవో, గెజిట్ ఇచ్చామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిందే అమలు చేయమని ఆర్టీసీ కార్మికులు అడుగుతున్నారన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోవడం వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి రూ.3000 కోట్లు ప్రభుత్వం బకాయిలు పడింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయబద్ధమైన కోరికలు నెరవేర్చాలన్నారు. తక్షణమే మహాలక్ష్మి బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అనంతబాబు కోసం పోలీసుల వేట..
# పరారీలో వైకాపా ఎమ్మెల్సీ!

- రాత్రి కాకినాడలోని నివాసంలో పోలీసుల సోదాలు
- అప్పటికే ఎమ్మెల్సీ అనంతబాబు పరారైనట్లు గుర్తింపు
- ఈ కేసులో అనంతబాబు అనుచరుడు ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు



**కాకినాడ, ఏప్రిల్ 22 (నినాదం):** వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు) కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తన మాజీ డ్రైవర్, దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించారన్న ఆరోపణలపై ఆయనపై కొత్తగా కేసు నమోదైంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కాకినాడలోని ఆయన నివాసానికి పోలీసులు చేరుకోగా, అప్పటికే ఆయన పరారైనట్లు తేలింది. సుబ్రహ్మణ్యం హత్య కేసు విచారణను ప్రభావితం చేసేందుకు అనంతబాబు ప్రయత్నిస్తున్నారని, కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పాలంటూ తమకు డబ్బు ఆశ చూపి, ప్రాణహాని తలపెడతామని బెదిరించారని నలుగురు కీలక సాక్షులు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అనంతబాబు, ఆయన అనుచరులపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న అనంతబాబు అనుచరుడు మాగంటి రాంబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. 2022లో జరిగిన సుబ్రహ్మణ్యం హత్య కేసులో అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఆయన బయట ఉన్నారు. అయితే, సాక్షులను ప్రభావితం చేస్తే బెయిల్ రద్దు చేస్తామని సుప్రీంకోర్టు ఆయన్ను గతంలోనే హెచ్చరించింది. ఏప్రిల్ 24, 25 తేదీల్లో ఈ హత్య కేసులో అభియోగాల నమోదు జరగాల్సి ఉండగా, అంతకు ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళవారం రాత్రి పోలీసులు అనంతబాబు నివాసానికి వెళ్లినప్పుడు ఆయన కారు, గన్‌మెన్ అక్కడే ఉన్నారు. అయితే, పోలీసుల రాకను ముందే పసిగట్టిన ఆయన మోటార్‌సైకిల్‌పై పరారైనట్లు సమాచారం. పరారీలో ఉన్న ఎమ్మెల్సీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# కబడ్డీ మ్యాచ్ పై రూ. 500 పందెం..

## కర్ణాటక హోంమంత్రిపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం


- కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వరపై బెట్టింగ్ ఆరోపణలు
- ఆయన పరిధిలోని పోలీసులే ఆయనపై విచారణ జరపాల్సిన పరిస్థితి



**బెంగళూరు, ఏప్రిల్ 22 (నినాదం):** కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర ఓ చిన్న బెట్టింగ్ వివాదంలో చిక్కుకున్నారు. కబడ్డీ టోర్నమెంట్‌లో రూ. 500 పందెం కాసిన వ్యవహారంలో ఆయనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరపాలని బెంగళూరులోని ఓ కోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... ఇటీవల తుమకూరులో రాష్ట్ర స్థాయి ప్రీ-యూనివర్సిటీ కాలేజీ కబడ్డీ టోర్నమెంట్ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి పరమేశ్వర, ఫైనల్ మ్యాచ్‌లో విజయపుర జట్టు గెలుస్తుందని జిల్లా డిప్యూటీ కమిషనర్ శుభా కల్యాణ్‌తో సరదాగా రూ. 500 పందెం కాశారు. అయితే, ఆ మ్యాచ్‌లో దక్షిణ కన్నడ జట్టు 36-26 తేడాతో విజయపుర జట్టుపై గెలిచింది. అనంతరం బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి స్వయంగా తాను పందెం కట్టి ఓడిపోయిన విషయాన్ని బహిరంగంగా ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా హెచ్ఆర్ నాగభూషణ్ అనే వ్యక్తి కోర్టులో ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి బహిరంగంగా బెట్టింగ్‌లో పాల్గొనడం చట్టవిరుద్ధమని, అది ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుందని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన బెంగళూరులోని 42వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.ఎన్. శివకుమార్, మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, సమగ్ర విచారణ జరపాలని పోలీసులను ఆదేశించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించే హోం శాఖకు పరమేశ్వర మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు ఆయన కింద పనిచేసే పోలీసులే ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం గమనార్హం.

# తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు..

## - మోదీ కీలక సందేశం



**కేదార్‌నాథ్, ఏప్రిల్ 22 (నినాదం):** ఆధ్యాత్మిక ప్రపంచంలో నేడు ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన శ్రీ కేదార్‌నాథ్ ధామం తలుపులు నేడు భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి. మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం నేడు ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేద మంత్రోచ్చారణలు, మేళతాళాల మధ్య సుమారు 51 క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# హైకోర్టు తీర్పుతో బుద్ధి తెచ్చుకోవాలి

- కాంగ్రెస్‌కు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై హైకోర్టు తీర్పును చూసైనా కాంగ్రెస్ పార్టీ బుద్ధి తెచ్చుకోవాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జీవధార కాళేశ్వరం మీద నిందలు మోపి బీఆర్ఎస్ , కేసీఆర్ ప్రతిష్ట దెబ్బ తీసేందుకు కాంగ్రెస్, బీజేపీ వాడుకున్నాయని ఆరోపించారు. ప్రాజెక్ట్‌ను రెండున్నరేళ్లు మరమ్మతులు చేపట్టకుండా అడ్డుకున్నారు. చివరకు గత్యంతరం లేక మరమ్మతులు చేపడుతున్నారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్ మీద చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై ఆయన హర్షణీయం వ్యక్తం చేశారు.

# పిన్నీసు నుంచి ఫోన్ దాకా..

# అన్నింటి ధరలూ పైపైకే!

- నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్ సహా అన్ని వస్తువుల ధరలకు రెక్కలు
- ఫోన్లు, ఏసీలు, టీవీల ధరల్లో 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరుగుదల
- పారాసిటమాల్ సహా 760 రకాల మందుల ధరలు అమాంతం పెంపు
- గ్యాస్ కొరతతో హోటళ్లలో ఇడ్లీ, దోశ వంటి టిఫిన్ల ధరలు ప్రియం



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ధరల భారం నలువైపుల నుంచి విరుచుకుపడుతోంది. ఉదయం తినే టిఫిన్ నుంచి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మందుల వరకు అన్నింటి ధరలూ అమాంతం పెరిగిపోయాయి. గత నెల రోజులుగా మార్కెట్లో చోటుచేసుకున్న ఈ మార్పులతో జీవన వ్యయం పెరిగి ప్రజలు విలవిల్లాడుతున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి మూతపడటంతో సరఫరా వ్యవస్థలకు ఆటంకాలు ఏర్పడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఎలక్ట్రానిక్, గృహోపకరణాల ధరలు భారీగా పెరిగాయి. రాగి, అల్యూమినియం వంటి ముడిసరుకుల ధరలు పెరగడం, సెమీకండక్టర్ చిప్‌ల కొరతతో ఫోన్ల ధరలు 10-20 శాతం వరకు పెరిగాయి. గతంలో రూ.15 వేలకు దొరికిన ఫోన్ ఇప్పుడు రూ.18 వేలు దాటింది. ఏసీల ధరలు 15 శాతం, టీవీల ధరలు 10 శాతం, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు 8-15 శాతం వరకు భారంగా మారాయి. టెలికం సంస్థలు కూడా టారిఫ్‌లను 20 శాతం వరకు పెంచాయి. మరోవైపు, అత్యవసర మందుల ధరలు సైతం చుక్కలనంటాయి. ఏప్రిల్ 1 నుంచి జ్వరం, మధుమేహం, బీపీకి వాడే 760 రకాల మందుల ధరలు పెరిగాయి. పారాసిటమాల్‌పై ఏకంగా 92 శాతం ధర పెరగడం ఆందోళన కలిగిస్తోంది. నిర్మాణ రంగంలోనూ ఉక్కు ధర 35 శాతం, సిమెంట్ ధర 10 శాతం పెరగడంతో సొంతింటి కల మరింత ప్రియంగా మారింది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్ కారణంగా హోటళ్లలో ఆహార పదార్థాల ధరలు పెరిగాయి. ఇడ్లీ, దోశ వంటి టిఫిన్ల ధరలు ప్లేటుకు రూ.10 నుంచి రూ.15 వరకు పెంచేశారు. ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ యాప్‌లలోనూ ధరలు 6 నుంచి 9 శాతం వరకు పెరగడంతో వినియోగదారులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఒకదాని ధర పెరగడం గొలుసుకట్టుగా మరోదానిపై ప్రభావం చూపుతూ అన్ని రంగాల్లోనూ ధరల మంట కొనసాగుతోంది.

## భర్త హత్యకు ప్రియుడితో కలిసి భార్య కుట్ర...

# అద్భుతంగా బతికి బయటపడ్డ భర్త!

- భర్తను కిడ్నాప్ చేసి, దాడి చేసి కాలువలో పడేసిన నిందితులు, ● భార్య, ప్రియుడు సహా ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**వడోదర, ఏప్రిల్ 22 (నినాదం):** గుజరాత్‌లోని వడోదరలో ఓ సంచలన హత్య కుట్ర వెలుగులోకి వచ్చింది. ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే కడతేర్చాలని ఓ భార్య పన్నిన పన్నాగం పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. కిడ్నాప్ చేసి, కాలువలో పడేసినప్పటికీ బాధితుడు అద్భుతంగా ప్రాణాలతో బయటపడటంతో ఈ ఘోరం వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు బాధితుడి భార్య, ఆమె ప్రియుడు సహా మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం వడోదరలోని ఛానీ ప్రాంతానికి చెందిన పాన్ పార్లర్ యజమాని గిరీశ్ పటేల్‌ను ఏప్రిల్ 15న కొందరు దుండగులు కిడ్నాప్ చేశారు. ఛానీ-సోఖ్డా రోడ్డుపై కారులో బలవంతం గా ఎక్కించుకుని, కత్తితో బెదిరించి, సోజిత్ర సమీపంలోని కాలువలో పడేశారు. గిరీశ్



చనిపోయాడని భావించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, కాలువలోని ఓ నిర్మాణాన్ని పట్టుకుని సుమారు మూడు గంటల పాటు గిరీశ్ ప్రాణాలతో పోరాడాడు. మరుసటి రోజు ఉదయం సురక్షితంగా బయటపడా డు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, తొలుత ఐదుగురు అనుమాని తులను అదుపులోకి తీసుకుని విచారించా రు. విచారణలో గిరీశ్ భార్య ఫాల్గుణి పటేల్ పాత్ర ఉన్నట్లు తేలింది. ఖేడా ప్రాంతానికి చెందిన సెలూన్ యజమాని కౌశిక్ శర్మతో ఫాల్గుణికి వివాహేతర సంబంధం ఉందని, తమ బంధానికి అడ్డుగా ఉన్న గిరీశ్‌ను చంపేందుకు ఇద్దరూ కలిసి కుట్ర పన్నారని పోలీసులు వెల్లడించారు. కౌశిక్ శర్మ ఈ హత్య కోసం నరేంద్ర అలియాస్ నికుల్ గోస్వామి అనే కిరాయి హంతకుడికి రూ.35,000 సుపారీ ఇచ్చాడు. ఘటనకు రెండు రోజుల ముందు ఫాల్గుణి, కౌశిక్ మధ్య 100కు పైగా ఫోన్ కాల్స్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. టెక్నికల్ ఆధారాలతో ఫాల్గుణిని ప్రధాన సూత్రధారి గా నిర్ధారించి, ఆమెతో పాటు కౌశిక్ శర్మ, ఇతర నిందితులను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిందితులందరినీ జ్యుడీషియల్ కస్టడీకి తరలించి, తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# సైబర్ నేరాలు పురుగుతున్న వేళ

- బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం
- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జనార్ లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్ ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్




ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గో÷-డలెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

# ఏసీబీ వలలో లంచావతారాలు..

## ఒకేరోజు మహిళా సీఐ, ఎస్సై, ఆర్డీవో అరెస్ట్

- జనన ధ్రువీకరణ పత్రాల కోసం లంచం తీసుకున్న నారాయణపేట ఆర్డీవో
- వరకట్న వేధింపుల కేసులో బెయిల్ కోసం రూ. 60 వేలు డిమాండ్ చేసిన సీఐ, ఎస్సై
- నెల రోజుల వ్యవధిలో ఏసీబీకి పట్టుబడిన పోలీసుల సంఖ్య 8కి చేరిక


**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** తెలంగాణలో లంచగొండి అధికారులు ఏసీబీకి వరుసగా పట్టుబడుతున్నారు. తాజాగా మంగళవారం ఒక్కరోజే వికారాబాద్‌లో ఇద్దరు మహిళా పోలీసు అధికారులు, నారాయణపేటలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. తాండూరుకు చెందిన ఇర్షాద్ అనే




వ్యక్తిపై అతని భార్య పెట్టిన వరకట్న వేధింపుల (498ఏ) కేసుకు సంబంధించి, ఆరుగురికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సరోజ, ఎస్సై రాణి రూ.60 వేలు డిమాండ్ చేశారు. చివరకు రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడు గత నెలలో రూ.20 వేలు చెల్లించినా, మిగిలిన డబ్బు కోసం ఒత్తిడి చేయడంతో ఏసీబీని ఆశ్రయించాడు. మంగళవారం బాధితుడి నుంచి మిగిలిన రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. మరోవైపు నారాయణపేటలో ఆర్డీవో రాంచందర్ కూడా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఊట్కూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఐదు జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా, పది నెలలుగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.25 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలోని బృందం ఆయన్ను కార్యాలయంలోనే పట్టుకుంది. కాగా, పోలీసు ఉన్నతాధికారులు ఎంతగా హెచ్చరిస్తున్నా కొందరి తీరు మారడం లేదు. తాజా ఘటనతో గత నెల రోజుల వ్యవధిలో ఏసీబీకి పట్టుబడిన పోలీసుల సంఖ్య 8కి చేరింది. గతంలో సిరిసిల్ల, నిర్మల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎస్ఐలు, హైదరాబాద్ విమానాశ్రయంలో ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ రెండు ఘటనలపై ఏసీబీ అధికారులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బంగారం చోరీ ఆరోపణలపై ఐదుగురు పోలీసుల సస్పెన్షన్

- ఇండోర్‌లో ఏప్రిల్ 1న ఘటన
- బాధితుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశం
- 20 తులాల బంగారం అపహరించారని బాధితుల ఆరోపణ



**ఇండోర్, ఏప్రిల్ 22 (నినాదం):** రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారారన్న ఆరోపణలు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కలకలం రేపాయి. ఒక ఇంట్లోకి చొరబడి, యజమానులతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా, బంగారు ఆభరణాలు దొంగిలించారన్న ఆరోపణలపై ఐదుగురు పోలీసులు సస్పెండ్ అయ్యారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ఏప్రిల్ 1వ తేదీ రాత్రి జరిగినట్లు తెలుస్తోంది. బాధితులు అధికారికంగా ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (జోన్ 2) కుమార్ ప్రతీక్ స్పందించారు. "ఏప్రిల్ 1 రాత్రి ఐదుగురు పోలీసులు ఫిర్యాదుదారుడైన వ్యాపారవేత్త ఇంటికి వెళ్లి, తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించి దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదు అందింది. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని ఐదుగురినీ సస్పెండ్ చేశాం" అని ఆయన ఏఎన్ఐకి తెలిపారు. రిటైర్డ్ ఏసీపీ రాకేష్ గుప్తాతో ఆర్థిక వివాదంలో ఉన్న గౌరవ్ జైన్ అనే వ్యక్తికి సంబంధించిన చెక్ బౌన్స్ కేసులో వారెంట్ అమలు చేయడానికి వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే, ఈ క్రమంలో తమ ఇంట్లో నుంచి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ కేసులో లసూడియా టీఐ (స్టేషన్ హౌస్ ఆఫీసర్) పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోందని, అతని ప్రమేయం ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని డీసీపీ కుమార్ వివరించారు. ప్రస్తుతం ఈ కేసును ఏసీపీ విజయ్‌నగర్ దర్యాప్తు చేస్తున్నారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.





| RANK | CITY | TEMPERATURE | STATUS | WEATHER CONDITION |
|---|---|---|---|---|
| 1. | Bhagalpur, Bihar, India | 44 °C | EXTREME HOT | Sunny |
| 2. | Talcher, Odisha, India | 44 °C | EXTREME HOT | Sunny |
| 3. | Asansol, West Bengal, India | 44 °C | EXTREME HOT | Sunny |
| 4. | Begusarai, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 5. | Motihari, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 6. | Munger, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 7. | Bhojpur, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 8. | Siwan, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| .9. | Bettiah, Bihar, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 10. | Balangir, Odisha, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 11. | Durgapur, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 12. | Paschim Medinipur, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 13. | Lumbini Sanskrltik, Lumbini Province, Nepal | 43 °C | EXTREME HOT | Sunny |
| 14. | Birbhum, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 15. | Gorakhpur, Uttar Pradesh, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 16. | Kulti, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 17. | Bankura, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 18. | Varanasi, Uttar Pradesh, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 19. | Raniganj, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |
| 20. | Dalurband, West Bengal, India | 43 °C | EXTREME HOT | Sunny |

Source: AQI.in | Data as of April 21, 2026, 12:21 pm IST Stay hydrated. Stay safe. Avoid sun exposure.

# అగ్నిగుండంగా భారత్..

## ప్రపంచంలోని 20 హాటెస్ట్ నగరాల్లో 19 మనవే!

- బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- ఏప్రిల్ 24 వరకు వడగాల్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- నిర్మలమైన ఆకాశం, పొడి గాలులే ప్రధాన కారణమని నిపుణుల విశ్లేషణ
- టాప్ 20 జాబితాలో భారత్ వెలుపల ఉన్న ఏకైక నగరం నేపాల్‌లోని లుంబిని

**ఢిల్లీ, ఏప్రిల్ 22 (నినాదం):** ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకు భారత్ కేంద్రంగా మారింది. ఏప్రిల్ 21న ాూ×.ఱఅ విడుదల చేసిన డేటా ప్రకారం ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల జాబితాను పరిశీలిస్తే అందులో 19 నగరాలు భారత్‌లోనే ఉన్నాయి. దేశంలోని ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. బిహార్‌లోని భాగల్‌పూర్, ఒడిశాలోని తాల్చేర్, పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నగరాలు 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. వీటితో పాటు బిహార్‌లోని బెగుసరాయ్, మోతిహారి, ముంగేర్, భోజ్‌పూర్, సివాన్‌లతో పాటు పశ్చిమ బెంగాల్, తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ జాబితాలో భారత్ వెలుపల ఉన్న ఏకైక ప్రాంతం నేపాల్‌లోని లుంబిని కావడం గమనార్హం. మరోవైపు, ఏప్రిల్ 22 నుంచి 24 వరకు దేశంలో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటితే దానిని వడగాల్పుగా పరిగణిస్తారు. వాతావరణ నిపుణుల ప్రకారం ఈ తీవ్రమైన వేడికి పలు కారణాలు ఉన్నాయి. నిర్మలమైన ఆకాశం కారణంగా సూర్యరశ్మి నేరుగా భూమిని తాకడం, హిమాలయాల్లో మంచు కవచం తగ్గడం, వాయవ్య దిశ నుంచి పొడి గాలులు వీయడం వంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. సముద్రపు నీటి ఉష్ణోగ్రతల్లో మార్పులు కూడా దీనికి దోహదం చేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రాబోయే వారాల్లో కూడా వేడి తీవ్రత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

# ప్రియుడి కోసం తండ్రికి షాక్...

## కిలో బంగారం మాయం చేసిన కూతురు!

- యజమాని కూతురితో ప్రేమ నాటకమాడిన మేనేజర్ సాగర్, ● బ్రెయిన్ ట్యూమర్ అంటూ నమ్మించి ఆర్థిక సహాయం కోరిన వైనం, ● ప్రియుడి మాటలు నమ్మి కిలో బంగారం ఇచ్చిన యువతి, ● పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చిన మోసం, ● నిందితుడి అరెస్ట్.. 20 తులాల బంగారం రికవరీ

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (నినాదం):** నమ్మకంగా పనిచేస్తున్నాడనుకున్న వ్యక్తే యజమాని కుటుంబానికి తీరని ద్రోహం చేశాడు. ప్రేమ పేరుతో యజమాని కుమార్తెను వంచించి, ఆమె నుంచి ఏకంగా కిలో బంగారు ఆభరణాలను కాజేశాడు. బ్రెయిన్ ట్యూమర్ అంటూ నాటకమాడి ఈ భారీ మోసానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి చైతన్యపురిలో టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన వద్ద 34 ఏళ్ల సాగర్ గత నాలుగేళ్లుగా మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబంతో కలిసిపోయాడు. ఈ క్రమంలోనే యజమాని కుమార్తెతో పరిచయం పెంచుకుని, ఆమెను ప్రేమ పేరుతో తనవైపు తిప్పుకున్నాడు. సాగర్‌కు అప్పటికే పెళ్లయ్యి ఒక పాప కూడా ఉండటం.. ఇంట్లో ఒకడిలా చూసుకుంటుండటంతో యజమానికి అతడి ప్రవర్తన పట్ల అనుమానం రాలేదు. కొంతకాలం తర్వాత తన పథకాన్ని అమలు చేయడం మొదలుపెట్టాడు. తనకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానంటూ ఆమె ముందు కన్నీటిపర్యంతమయ్యాడు. అతని మాటలను పూర్తిగా నమ్మిన ఆ యువతి, ప్రియుడిని కాపాడుకోవాలని నిర్ణయించుకుంది. ఇంట్లో ఎవరికీ తెలియకుండా లాకర్‌లో ఉన్న కిలో బంగారు ఆభరణాలను తీసుకెళ్లి అతనికి ఇచ్చింది. ఆ బంగారంలో కొంత అమ్మి అప్పులు తీర్చుకున్న సాగర్, మిగిలిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడపడం ప్రారంభించాడు.

ఖరీదైన దుస్తులు, వస్తువులు కొంటూ తన జీవనశైలిని మార్చుకున్నాడు. ఇదిలా ఉంటే.. ఈ నెల 17న వ్యాపారి కుటుంబం తమ సొంతూరు వెళ్లేందుకు సిద్ధమవుతూ లాకర్‌ను పరిశీలించగా, కిలో బంగారం కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. వెంటనే చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులను విచారించగా, కుమార్తె ప్రవర్తనపై అనుమానం వచ్చింది. ఆమెను లోతుగా ప్రశ్నించడంతో అసలు విషయం వెల్లడించింది. ఆమె ఇచ్చిన సమాచారంతో పోలీసులు నిందితుడు సాగర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.